

జగిత్యాలరూరల్: వేదికపై గురువులతో ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులు



జగిత్యాల: వేదికపై జగిత్యాల రూరల్ మండలం గుట్రాజ్‌పల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు

జగిత్యాల/జగిత్యాల రూరల్, జూన్ 8: జగిత్యాల పట్టణంలోని శ్రీకాసుగంటి నారాయణ రావు డిగ్రీ కళాశాలలో 1997-2000 విద్యా సంవత్సరంలో డిగ్రీ పూర్తి చేసిన బీకాం విద్యార్థులు ఆదివారం సిల్వర్ జూబ్లీ వేడుకలను స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. పూర్వ విద్యార్థులంతా ఒకచోట చేరి తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులను ఆహ్వానించి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాయికల్ మున్సిపల్ మాజీ చైర్మన్ మోర హన్మాండ్లు, అధ్యాపకులు చెన్నమనేని రాజేశ్వర్ రావు, చెన్న గణశ్, లక్ష్మణ్, నరేందర్, డాక్టర్ లర్వపల్లి రాజేశ్వర్, అవారి శంకరయ్య, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే, జగిత్యాల రూరల్ మండలం గుట్రాజ్‌పల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 2007-08 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు గాలిపెల్లి ఈశ్వర్ కుమార్, గంగరాజం, ప్రవీణ్‌ను శాలువాలతో సత్కరించారు.

ఇబ్రహీంపట్నం/ రాయికల్, జూన్ 8: ఇబ్రహీంపట్నం మండలం గోదూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో 2004-05 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చదువు చెప్పిన గురువులను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఒకరి బాగోగులు మరొకరు తెలుసుకొని రోజంతా ఆటపాటలతో గడిపారు. రాయికల్ పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 2009-10 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆహ్వానించి శాలువాలతో సత్కరించారు. అలాగే, పట్టణంలోని వివేకవర్ధిని హైస్కూల్లో 2003-04 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.



ఇబ్రహీంపట్నం: గోదూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో..



రాయికల్: పట్టణంలోని బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలలో. .

## ప్రాణాలు తీస్తున్న ఇసుక ట్రాక్టర్లు!

- రెచ్చిపోతున్న ఇసుక అక్రమార్కులు
- కాలంచెల్లిన వాహనాలతో అక్రమదందా
- పట్టించుకోని అధికారులు

ఇసుక అక్రమ రవాణా అమాయకుల ప్రాణం బలిగొంటున్నది. అక్రమార్కులు కాలంచెల్లిన ట్రాక్టర్లు వాడుతూ.. అక్రమ దందాతో అడ్డగోలుగా సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ రవాణాను నివారించాల్సిన సంబంధిత అధికారులు షరా 'మాములు'గా తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అతివేగం, అజాగ్రత్తతో వాహనాలు నడపడంతో తరచూ ప్రమాదాలు జరుగడంతో వాహనచోదకులు భయాందోళనకు గురవుతున్నారు.

**- మెట్‌పల్లి, జూన్ 8**

మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, కోరుట్ల, కథలాపూర్ మండలాల్లో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నది. కథలాపూర్ మండలం తక్కళ్లపల్లి, మెట్‌పల్లి మండలం ఆత్మకూర్, ఆత్మనగర్, తదితర గ్రామాల శివారులోని వాగుల్లో ఇసుకను తోడేస్తున్నారు. ట్రాక్టర్లలో పట్టణాలు, వివిధ గ్రామాలకు తరలిస్తున్నారు. మరో వైపు రుతుపవనాలు సమీపిస్తున్న నేపథ్యంలో వరద ప్రభావంతో ముందస్తుగా ఇసుకను తోడేస్తూ డంప్ చేస్తున్నారు. రాత్రి, పగలు తేడాలేకుండా ఇసుక రవాణా చేస్తున్నారు.

### కాలం చెల్లిన వాహనాల వాడకం

ఇసుక రవాణా కోసం అక్రమార్కులు కాలం చెల్లిన, నంబర్ ప్లేట్ లేని వాహనాలు ఉపయోగిస్తున్నారు. ఎక్కడైనా ప్రమాదం జరిగితే సులువుగా తప్పించుకునేందుకు గానూ ఈ ఎత్తగడ అనుసరిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాలో పట్టుబడి సీజ్ అయితే ఈ కాలం చెల్లిన ట్రాక్టర్ తిరిగి చేతికిరాకపోయినా ఫర్వాలేదు అనే ధీమాతో అక్రమార్కులు ఉన్నారు. అసలే డొక్కు ట్రాక్టర్ల వినియోగం, ఆపై త్వరగా ఇసుకను తరలించే క్రమంలో అతివేగం, అజాగ్రత్తగా డ్రైవింగ్ చేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

### అతివేగంతో ప్రమాదాలు

మెట్‌పల్లి పట్టణ శివారులోని వెల్లుల్ల రోడ్డులో గల బ్రిడ్జి సమీపంలో ఈనెల 5న రాత్రి జరిగిన ప్రమాదంలో మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ గ్రామానికి చెందిన గుగ్గిళ్ల రవి అనే యువకుడు మృతిచెందాడు. ద్విచక్రవాహనంపై మెట్‌పల్లి పట్టణంలో పని ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్తుండగా మార్గం మధ్యలో ఇసుక ట్రాక్టర్ ఢీకొని మృతి చెందాడు. ఈ ప్రమాదానికి ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం కారణమని స్థానికులు చెబుతున్నారు. గతంలోనూ ఇదే రోడ్డులో ఇసుక ట్రాక్టర్ ఢీకొని వెల్లుల్ల, అమ్మక్కపేట గ్రామాలకు చెందిన ఇద్దరు యువకులు మృతి చెందారు. ఇవే కాకుండా మల్లాపూర్, కథలాపూర్, మెట్‌పల్లి, కోరుట్ల మండలాల్లో తరచూ ఇసుక ట్రాక్టర్లతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎంతో మంది ప్రాణాలు గాలిలో కలుస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.



వెల్లుల్ల రోడ్డులో ఈనెల 5న యువకుడిని ఢీకొన్న ఇసుక ట్రాక్టర్

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్యాల, జూన్ 8: మండలంలోని మల్యాల, తక్కళ్లపల్లి గ్రామాలకుసోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మల్యాల విద్యుత్ శాఖ ఏఈఈ దయానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## జగిత్యాలలో ఒరిజినల్ కాంగ్రెస్ పేరిట ఫ్లెక్సీలు



జగిత్యాలలో ఒరిజినల్ కాంగ్రెస్ పేరిట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

జగిత్యాల, నమస్తే తెలంగాణ, జూన్ 8: ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు మంత్రి పదవి వచ్చిన సందర్భంగా జగిత్యాలలో అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి ఫొటోలతో ఫ్లెక్సీలు వెలిశాయి. టీపీసీసీ ప్రచార కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ముంజాల రఘువీర్ గౌడ్ పేరిట ఏర్పాటైన ఫ్లెక్సీలో దిగువన ఒరిజినల్ కాంగ్రెస్ అని పేర్కొన్నారు. అలాగే, ఏడాది క్రితం కాంగ్రెస్‌లో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఫొటో కూడా ముద్రించలేదు.

## అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



ప్రకాశ్‌కు అంబేద్కర్ చిత్రపటం అందజేస్తున్న నాయకులు

జగిత్యాల రూరల్, జూన్ 8: అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రిటైర్డ్ ఆర్మీ జవాన్ మెట్టు ప్రకాశ్ కోరారు. ప్రబుద్ధ భారత్ ఇంటర్నెషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం అంబేద్కర్ స్మరణ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తా వద్ద ఆయన నాయకులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీఐసీసీఐ జిల్లా కన్వీనర్ నల్ల శ్యామ్, నాయకులు బత్తుల ప్రదీప్, నర్ర రాజేందర్, మ్యాదరి శ్రీహరి, ఎడ్ల లక్ష్మి, అనంతుల కాంతారావు, పొనగంటి రాజారత్నం, లక్ష్మణ్, సంకె మహేశ్, రమేశ్, రాజేశ్, చిన్న లక్ష్మణ్, ప్రకాశ్, కమలాకర్, అశోక్, ప్రవీణ్ పాల్గొన్నారు.

## అధ్యక్షుడిగా గోవింద్ నాయక్

జగిత్యాల రూరల్/మల్లాపూర్, జూన్ 8: ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ జిల్లా అధ్యక్షుడిగా మల్లాపూర్ మండలం సిరిపూర్ మాజీ సర్పంచ్ భుక్యా గోవింద్ నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఎర్రగడ్డ (బంజారనగర్)లో మాజీ ఎమ్మెల్సీ, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సభావత్ రాములు నాయక్ నియామక పత్రాన్ని అందజేశారు.

## పేద విద్యార్థికి ఆర్థిక సాయం

సారంగాపూర్, జూన్ 8: బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన గుండ నందిని తల్లిదండ్రులు చిన్న వయసులోనే మృతి చెందగా, నానమ్మ వద్ద ఉంటూ బాసర ట్రిపుల్ ఐటీలో విద్యనభ్యసిస్తున్నది. ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండగా ఆదివారం బీర్‌పూర్ గ్రామ యువ చైతన్య యూత్ సభ్యులు రూ. 5 వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## మృగశిర కార్తె సందడి



జగిత్యాలటౌన్: మృగశిర మందు సేవిస్తున్న భక్తులు

మారుతీనగర్, జూన్ 7: జిల్లా వ్యాప్తంగా మృగశిర కార్తె సందడి నెలకొంది. మార్కెట్లలో చేపలు కొనేందుకు ప్రజలు బారులు తీరారు. మెట్‌పల్లి పట్టణంలోని పాత బస్టాండ్‌లో చేప మందు వేశారు.

జగిత్యాల టౌన్, జూన్ 8: జిల్లా కేంద్రంలోని చింతకుంట చెరువు సమీపంలో సూర్య భగవాన్ ధనలక్ష్మిసమేత ధన్వంతరి ఆలయంలో ఆదివారం మృగశిర కార్తె పురస్కరించుకొని మృగశిర మందు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ మందు సేవించిన వారికి దగ్గు, దమ్ము, శ్వాసకోశ, ఉదరకోశ వ్యాధులు రాకుండా ఉంటాయని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. సుమారు వెయ్యి మందికి ఈ మందు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు చిలకముక్కు నాగరాజు శర్మ, ఫౌండర్ డాక్టర్ రాజన్న, అధ్యక్షుడు పాల్తెపు శంకర్, డాక్టర్ ధనుంజయ, తవుటు రామచంద్రం, డాక్టర్ గుడిసె వెంకట్రాజం, వొడ్నాల శ్రీనివాస్, రాజశేఖర్, గట్టు రాజేందర్, విద్యాసాగర్‌రావు, శ్రీనివాస్, స్వాతి, లత, భక్తులు పాల్గొన్నారు.

## కళాశాలల అభివృద్ధికి కృషి చేయాలి




కళాశాల ఆవరణలో అధ్యాపకులతో రేమిడి మల్లారెడ్డి

జగిత్యాల టౌన్, జూన్ 8: ప్రభుత్వ జూనియర్ కళాశాలల అభివృద్ధికి అధ్యాపకులంతా కృషి చేయాలని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ 475 రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేమిడి మల్లారెడ్డి కోరారు. మేడిపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాన్ని ఆదివారం ఆయన సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొట్టాల తిరుపతిరెడ్డి, అత్తినేని శ్రీనివాస్‌తో కలిసి సందర్శించారు. అనంతరం ఆయన జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఉమ్మడి జిల్లా బాక్సింగ్ జట్ల ఎంపిక

కొత్తపల్లి, జూన్ 8 : ఉమ్మడి కరీంనగర్ జిల్లా జూనియర్స్ బాయ్స్, గర్ల్స్ బాక్సింగ్ జట్ల ఎంపిక పోటీలు ఆదివారం జిల్లా కేంద్రంలోని డా. బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను ఉమ్మడి జిల్లా జట్లకు సెలెక్ట్ చేశారు. ఎంపికైన క్రీడాకారులు జూన్ 10, 11వ తేదీల్లో నిజామాబాద్‌లో జరిగే రాష్ట్ర బాక్సింగ్ జూనియర్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొననున్నారు.

## వేతనాలందక పంచాయతీ కార్మికుల ఇక్కట్లు

జగిత్యాల, జూన్ 8: వేతనాలు రాక గ్రామ పంచాయతీ సిబ్బంది ఆకలితో అలమటిస్తున్నారని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పులి మల్లేశం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి వేతనాలు చెల్లించాలని, లేనిపక్షంలో గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

## 14 నుంచి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు



మాట్లాడుతున్న బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు

జగిత్యాల, జూన్ 8: జిల్లా కేంద్రంలోని క్లబ్‌లో ఈనెల 14, 15వ తేదీల్లో జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రామకృష్ణారావు, పీ రామ్మోహన్ రావు తెలిపారు. క్లబ్‌లో ఆదివారం బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు శ్రీనివాస్, వెంకటరమణ, మహేందర్, విజయ్‌కుమార్, కిశోర్‌కుమార్, మహేశ్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

ఇబ్రహీంపట్నం, జూన్ 8: నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి రాజ్‌కుమార్ హెచ్చరించారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే కఠిన చర్యలతో పాటు దుకాణాల లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఫర్టిలైజర్ షాపుల్లో స్టాక్ బోర్డుపై విత్తనాలు, ఎరువుల వివరాలతో పాటు నేమ్‌బోర్డుపై రేట్ల వివరాలు నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో లైసెన్సు లేకుండా విత్తనాలు, ఎరువులు అమ్మితే కేసు నమోదు చేస్తామన్నారు. రైతులు విత్తనాలు విత్తే ముందు విత్తన శుద్ధి చేపట్టాలన్నారు.

## పేద యువకుడికి ఆర్థిక చేయూత



అజయ్‌కి నగదు అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్

జగిత్యాల, జూన్ 8: మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం మిడిపల్లి గ్రామానికి చెందిన నిరుపేద ముత్యపు అభిలాష్ రైల్లో ప్రయాణం చేస్తూ మంచిర్యాల స్టేజీ వచ్చిందని దిగడానికి ప్రయత్నం చేస్తుండగా, ఫిట్స్ వచ్చి ప్రమాదవశాత్తు రైలులోంచి ప్లాట్ ఫారంపై పడిపోయాడు. తీవ్ర గాయాలు కాగా, దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. వాసవి సేవా దళ్ జగిత్యాల మూడు గ్రూపుల ద్వారా దాతలు అభిలాష్ తమ్ముడు అజయ్ కుమార్ ఫోన్‌పే, గూగుల్ పే నంబర్ 76759 25227కు రూ. 63,639 సాయం అందించారు. డిస్ట్రిక్ట్ స్పెషల్ బ్రాంచ్ జగిత్యాల కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్ ఆరిఫ్ అలీఖాన్ చేతుల మీదుగా అభిలాష్ తమ్ముడు అజయ్ కుమార్ దంపతులకు ఆదివారం అందజేశారు.

## మహిళా చట్టాలపై అవగాహన సదస్సు

జగిత్యాల, జూన్ 8: జిల్లా కేంద్రంలోని సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ కార్యాలయంలో తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న 16 మంది మహిళలను రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ కృష్ణారెడ్డి, హరి అశోక్ కుమార్, హన్మంత రెడ్డి శాలువాలతో సన్మానించారు. ఈ సదస్సులో శ్రావణి సంస్థ అధ్యక్షుడు దిండిగాల విఠల్, మహిళా సంఘాల జేఏసీ జిల్లా నేతలు కస్తూరి శ్రీమంజరి, గంగం జలజ, సింగం పద్మ, బక్కశెట్టి లక్ష్మి, బైరి రాధ, విజయ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభావంతులకు ఆత్మీయ సత్కారం



ప్రతిభావంతులతో ఆర్యవైశ్య సంఘం సభ్యులు

మారుతీనగర్, జూన్ 8: మెట్‌పల్లి పట్టణంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు మైలారపు రాంబాబు, మైలారపు లింబాద్రిల ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 36 మంది విద్యార్థులకు ఆదివారం జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. శాలువాలతో ఆత్మీయ సత్కారం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు కోట సుమన్, పుల్లూరి నవీన్, చాడ చందు, బండారి శివ, శ్రీనివాస్, సంతోష్, కిరణ్‌కుమార్, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

## నేటి ప్రజావాణి రద్దు

జగిత్యాల, జూన్ 8: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ బీ సత్యప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు సమస్యలపై వినతులు ఇవ్వడానికి కలెక్టరేట్‌కు రావొద్దని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నందున ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు.

## పాఠశాలకు స్మార్ట్ టీవీ బహూకరణ

సారంగాపూర్, జూన్ 8: మండలంలోని నాగునూర్ ప్రభుత్వ పాఠశాలకు గ్రామానికి చెందిన చీటీ ప్రభాకర్ రావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు చీటి శ్రీనివాస్ రావు రూ. 15 వేల విలువైన స్మార్ట్ టీవీని ఆదివారం ఉపాధ్యాయులకు అందజేశారు. శ్రీనివాస్ రావుకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గౌస్‌పాషా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రావు, నరేశ్‌రావు, చిట్నేని విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## హిందూ సామ్రాజ్యవాద దినోత్సవం

రాయికల్, జూన్ 8: రాయికల్ పట్టణంలో ఆదివారం సంఘమిత్ర యూత్, శివాజీ రైతు యువజన సంఘం ఆధ్వర్యంలో హిందూ సామ్రాజ్యవాద దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి, కాషాయ జెండా ఎగురవేశారు. అనంతరం వక్త, ప్రభుత్వ ఉపాధ్యాయుడు వేల్పుల గంగరాజంను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కురుమ సుదర్శన్, నారాయణ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, పటేల్ శివారెడ్డి, అనిల్, మోహన్ రెడ్డి, కిశోర్, జలపతి రెడ్డి, రవి, జలందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పరిశీలన

మల్యాల, జూన్ 8: మండలంలోని నూకపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బత్తిని మల్లీశ్వరీ గౌడ్, దారం ఆదిరెడ్డి, నాయకులు శంకర్, శనిగారపు తిరుపతి, కనకట్ల జలందర్, మిలిటరీ శీను, ముద్దం శ్రీనివాస్, మేక లక్ష్మణ్, కంచర్ల లక్ష్మణా చారి, వెంకటేశ్ పాల్గొన్నారు.

## బండలింగాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం



చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యుడు చైతన్య

మెట్‌పల్లి రూరల్, జూన్ 8: మండలంలోని బండలింగాపూర్ గ్రామంలో మెట్‌పల్లి సిరి పిల్లల దవాఖాన ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 50 మంది చిన్నారులకు వైద్యుడు చైతన్య వివిధ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గండిహనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్ రామాంజనేయం, నాయకులు జంగ స్వామి, జంగిటి రాజేందర్, చెప్పాల రాజం, గూడూరు తిరుపతి, అంగరి గంగాధర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెలాఖరు వరకు రేషన్ బియ్యం పంపిణీ

మెట్‌పల్లి రూరల్, జూన్ 8: మెట్‌పల్లి పట్టణ, మండలంలోని రేషన్ దుకాణాల్లో ఈనెలాఖరు వరకు బియ్యం పంపిణీ చేస్తారని తహసీల్దార్ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒకేసారి మూడు నెలల బియ్యం పంపిణీ చేస్తుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

## అక్రమంగా మొరం తరలిస్తున్న వాహనాలు సీజ్

ఇబ్రహీంపట్నం, జూన్ 8: బండ లింగాపూర్ శివారులోని కుందేళ్ల గుట్ట నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్న జేసీబీ, మూడు ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొరం తరలిస్తున్నారన్న సమాచారంతో కుందేళ్లగుట్ట వద్దకు వెళ్లిన పోలీసులకు మొరం తరలించేందుకు సిద్ధంగా ఉన్న జేసీబీ, మూడు ట్రాక్టర్లను పట్టుకున్నారు. వాహనాలను స్టేషన్‌కు తరలించి మెట్‌పల్లి తహసీల్దార్‌కు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

## అనాథ ఆడబిడ్డ పెళ్లికి హాజరైన మాజీ ఎమ్మెల్యే

చొప్పదండి, జూన్ 8 : కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం కాట్నపల్లి గ్రామానికి చెందిన అనాథ ఆడబిడ్డ మమత పెళ్లికి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ దీవెన దంపతులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆయన ఎమ్మెల్యేగా కొనసాగుతున్న సమయంలో మమత, సమత తల్లిదండ్రులు అనారోగ్యంతో మృతిచెందగా, నాటి నుంచి సుంకె రవిశంకర్ కన్నతండ్రిలా వారికి అన్ని విధాలా అండగా నిలిచిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మమత పెళ్లి కుదరడంతో శనివారం నూతన వస్త్రాలు, బంగారు ఉంగరాన్ని కానుకగా పంపించారు. ఆదివారం పెళ్లిలో వధూవరులను ఆశీర్వదించి, ఆనంద భాష్పాలు రాల్చారు.

## మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు లీకేజీ



ఎస్సారెస్పీ ప్రధాన కాలువ వంతెన వద్ద రోడ్డుపై పారుతున్న మిషన్ భగీరథ నీరు

పెగడపల్లి, జూన్ 8: పెగడపల్లి నుంచి నందగిరి, ఐతుపల్లి గ్రామాలకు వెళ్లే మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు స్థానిక కస్తూర్బా సమీపంలో, నందగిరి రైతు వేదిక, ఎస్సారెస్పీ కాలువ వంతెన వద్ద లీకేజీలు పడ్డాయి. పది రోజులుగా నీరంతా వృథాగా పోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. నీళ్లు రోడ్డుపైకి వచ్చి బురదగా మారుతుండడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభం

మేడిపల్లి, జూన్ 8: మేడిపల్లి మండలం కట్లకుంట గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు ఆదివారం విప్ ఆది శ్రీనివాస్ భూమి పూజ చేశారు. అలాగే, 67 మంది లబ్ధిదారులకు రూ. 22 లక్షల 77 వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్‌కుమార్, వైస్ చైర్మన్ మిట్టపెల్లి రాజిరెడ్డి, మాజీ జడ్పీటీసీ జలందర్, తదితరులు పాల్గొన్నారు.


## బో 'నమో' పోచమ్మ



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న గ్రామస్తులు

వెల్గటూర్, జూన్ 8: వెల్గటూర్ మండలం కిషన్‌రావుపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గ్రామంలో ఇంటికో బోనం చేసి, ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడికి పరామర్శ



సురేందర్‌రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

మేడిపల్లి, జూన్ 8: భీమారం మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు వొద్దినేని హరిచరణ్‌రావు తండ్రి సురేందర్‌రావు ఇటీవల మృతి చెందాడు. కాగా, హరిచరణ్‌రావును విప్ ఆది శ్రీనివాస్ ఆదివారం పరామర్శించారు. సురేందర్‌రావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఇక్కడ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్‌కుమార్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బొంగోని రాజాగౌడ్ తదితరులున్నారు.

## పశువధ చేస్తే కఠిన చర్యలు

రాయికల్, జూన్ 8: పశువులను అక్రమంగా వధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సుదీర్ రావు హెచ్చరించారు. రాయికల్ పట్టణ శివారులో కొందరు ఆదివారం ఉదయం పశువులను వధిస్తున్నారన్న సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లి, పశు వధకు పాల్పడిన వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.